**ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం**

**ప్రాంతీయ వార్తా విభాగం**

**ప్రాంతీయ వార్తలు**

**తేదీ: 16.11.2025** **సమయం:13.10 గంటలు**

**ముఖ్యాంశాలు**

1. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన ప్రత్యేక లోక్ అదాలత్ లో 42 వేలకు పైగా కేసులు పరిష్కారమయ్యాయి.
2. ప్రతి 15 రోజులకు ఒకసారి విద్యాసంస్థలను సందర్శించాలని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ జిల్లాల అధికారులను ఆదేశించారు.
3. మేడారం సమ్మక్క-సారలమ్మ జాతర పనులను వేగవంతం చేయాలని మంత్రి ధనసరి అనసూయ సీతక్క అధికారులను ఆదేశించారు.
4. రాష్ట్రవ్యాప్తంగా కనిష్ఠ ఉష్ణోగ్రతల్లో గణనీయమైన తగ్గుదల నమోదు అయ్యింది. మరికొన్ని రోజులు ఇదే పరిస్థితి కొనసాగే అవకాశం ఉందని వాతావరణ విభాగం పేర్కొంది.

..............................................

**లోక్ అదాలత్:**

రాష్ట్ర వ్యాప్తంగా నిన్న నిర్వహించిన ప్రత్యేక లోక్ అదాలత్ కు విశేష స్పందన లభించింది. మొత్తం 42,063 కేసులు పరిష్కారమయ్యాయి. ఆసిఫాబాద్ జిల్లాలో నిర్వహించిన ప్రత్యేక లోక్ అదాలత్ లో 842 కేసుల పరిష్కారం అయ్యాయి. జిల్లా కేంద్రంతో పాటు సిర్పూర్ కోర్టులో మొత్తం నాలుగు బెంచీలు ఏర్పాటు చేసి కేసులు

పరిష్కారం చేసినట్లు జిల్లా జడ్జి ఎం.వి రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో నిర్వహించిన ప్రత్యేక లోక్ అదాలత్ లో 303 కేసులు పరిష్కారమయ్యాయనీ... 61 లక్షల 53 వేల 958 రూపాయిల నష్ట పరిహారం బాధితులకు ఇప్పించినట్లు రాజన్న సిరిసిల్ల జిల్లా ఇంచార్జి ప్రధాన న్యాయమూర్తి పుష్పలత తెలిపారు. రాష్ట్ర హైకోర్టులో 25 కేసులును పరిష్కరించి 86 లక్షల 58 వేల 550 రూపాయలను లబ్దిదారులకు అందించారు.

-పీటీసీ, ఆసిఫాబాద్/పీటీసీ సిరిసిల్ల

**ఐటీడీఏ-భద్రాద్రి కొత్తగూడెం:**

సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ (ఐటీడీఏ) ద్వారా అందిస్తోన్న వివిధ సంక్షేమ పథకాలపై... షెడ్యూల్ కులాల అభివృద్ధి, గిరిజన, సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విద్యాలయాలలో మౌలిక వసతులకోసం ప్రత్యేక నిధులకు కేటాయిస్తామనీ... ఐటీడీఏలకు అన్ని శాఖల గ్రాంట్లు వచ్చేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కలెక్టర్, ఆర్డీవో సహా జిల్లా స్థాయి అధికారులు ప్రతి 15 రోజులకు ఒకసారి తప్పనిసరిగా అన్ని పాఠశాలలను సందర్శించాలని... విద్యార్థుల కోసం అవసరమైన చోట మెడికల్ క్యాంపులు నిర్వహించాలని సూచించారు.

-పీటీసీ, భద్రాద్రి కొత్తగూడెం

**పత్తి కొనుగోళ్లు నిలిపివేత:**

మంచిర్యాల జిల్లా లక్సెట్టిపేట మండల కేంద్రంలోని సీసీఐ జిన్నింగ్ మిల్లులో రేపు పత్తి కొనుగోళ్లు నిలిపివేస్తున్నట్లు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఇన్చార్జి కార్యదర్శి

రాజేశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. మిల్లుల యాజమాన్యం సమ్మెలో ఉండటంతో కొనుగోలు ప్రక్రియ సాధ్యం కాదని ఆయన పేర్కొన్నారు. తిరిగి కొనుగోళ్లు ప్రారంభించే తేదీని ప్రకటిస్తామని, రైతులు సహకరించాలని ఆయన కోరారు.

- పీటీసీ మంచిర్యాల

**కొనుగోలు కేంద్రాలు:**

ప్రభుత్వం నిర్వహిస్తున్న పంట కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆసిఫాబాద్ శాసన సభ్యులు కోవ లక్ష్మీ కోరారు. ఆసిఫాబాద్ జిల్లా జైనురు మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సొయాబిన్ కొనుగోలు కేంద్రాన్ని మార్కెట్ కమిటీ చైర్మన్ విశ్వనాథ్ తో కలిసి ఆమె ప్రారంభించారు. ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరకు రైతుల నుండి పంట కొనుగోలు చేయాలని సిబ్బందికి సూచించారు. రైతులు దళారులను నమ్మి ఇబ్బందుల పాలు కావొద్దని లక్ష్మీ అన్నారు.

- పిటిసి, ఆసిఫాబాద్

**హరీష్ రావు:**

కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల రాష్ట్ర వ్యాప్తంగా రైతులు ఇబ్బందులు పడుతున్నారని మాజీ మంత్రి, శాసనసభ్యులు హరీష్ రావు ఆరోపించారు. సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం మల్లారం గ్రామంలోని వడ్ల కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన అనంతరం హరీష్ రావు మాట్లాడుతూ... ప్రభుత్వం 85 లక్షల మెట్రిక్ టన్నుల వడ్లు కొనుగోలు చేస్తామని చెప్పి... ఇప్పటి వరకు ఐదారు లక్షలకు మాత్రమే పరిమితమైందని ఆరోపించారు. కొనుగోళ్లకు సంబంధించి 1200 కోట్ల రూపాయల వరకు కనీస మద్దతు ధర పెండింగ్ లో ఉందని, దాదాపు 200 కోట్ల

రూపాయల బోనస్ పెండింగ్ లో ఉందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 6 లక్షల ఎకరాల్లో మక్కలు పండించినా కొనుగోలు కరువైందన్నారు. జిన్నింగ్ మిల్స్, కేంద్ర ప్రభుత్వ సిసిఐ పత్తి కొనుగోలు చేయడం లేదని ఆరోపించారు. పంటలు దెబ్బతిన్న రైతులకు ఇన్పుట్ సబ్సిడీ విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

**----------సౌండ్ బైట్ : మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు--------**

**మెగా వైద్య శిబిరం:**

వరంగల్ కేఎంసీ ఆధ్వర్యంలో ఈ నెల 17వ తేదీన హన్మకొండ జిల్లా ఎల్కతుర్తి పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించే మెగా వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రజలను కోరారు. మెగా వైద్య శిబిరం నిర్వహించే స్థలాన్ని పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడుతూ... ఎనిమిది మందితో కూడిని వైద్యుల బృందం పరీక్షలు నిర్వహిస్తుందనీ... అవసరమైతే ఇతర పరీక్షలు వరంగల్ కేఎంసీ ఆసుపత్రిలో చేస్తారని చెప్పారు.

- వరంగల్ పి టి సి

**వందేమాతరం @150:**

మహాత్మాగాంధీ ఆశయసాధన యువతతోనే సాధ్యమని ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాంరెడ్డి అన్నారు. ఖమ్మం భక్తరామదాసు కళాక్షేత్రంలో గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ, యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో జరిగిన వందేమాతరం @150 కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ... వందేమాతర గీతం విశిష్టత గురించి వివరించారు. దేశానికి అతిపెద్ద బలం యువతేననీ.., యువత సన్మార్గంలో పయనించి దేశానికి శక్తిగా మారాలని అన్నారు. వ్యసనాలు, చెడు

అలవాట్లకు యువత దూరంగా ఉండాలనీ..., దేశాభివృద్ధికి తమవంతుగా దోహదపడాలని పిలుపునిచ్చారు.

**-----సౌండ్ బైట్: ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాంరెడ్డి----**

-పీటీసీ, ఖమ్మం

**అగ్నివీర్ రిక్రూట్మెంట్ ర్యాలీ:**

హన్మకొండలోని జవహర్లాల్ నెహ్రూ స్టేడియంలో అగ్నివీర్ రిక్రూట్మెంట్ ర్యాలీ కొనసాగుతోంది. ప్రతిరోజు మూడు జిల్లాల అగ్నివీర్ అభ్యర్థులకు దేహధారుద్య పరీక్షలతో పాటు వైద్యారోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ రోజు వికారాబాద్, మేడ్చల్, నాగర్ కర్నూల్ జిల్లాల అభ్యర్థులకు ఈవెంట్స్ నిర్వహిస్తున్నారు. సైన్యంలో చేరి దేశ సేవ చేయాలనే కోరికతో యువత ఈ ఈవెంట్ లో ఉత్సాహంగా పాల్గొంటున్నారు.

- వరంగల్, పి టి సి

**కుంటల ప్రాముఖ్యత:**

హనుమకొండ జిల్లాలో చెరువులు, కుంటల ప్రాముఖ్యతను గుర్తించి, సమగ్ర వివరాలు అందించాలని జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ సాగునీటిపారుదల శాఖ అధికారులను ఆదేశించారు. నిన్న రాత్రి హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని వివిధ శాఖల అధికారులతో ఆయన సమావేశమయ్యారు. ప్రాధాన్యత క్రమంలో వంద ఎకరాల విస్తీర్ణం కలిగిన జిల్లాలోని 11 చెరువులను సాగునీటి పారుదల శాఖ డీఈలు క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించాలన్నారు. జిల్లాలో తడి నేలలను గుర్తించి వాటి పరిరక్షణకు సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించేందుకు బుధవారం నాటికి నివేదికను అందజేయాలని ఆదేశించారు. -వరంగల్ పి టి సి

**చాడ వెంకట్ రెడ్డి:**

మత రాజకీయాలు దేశానికి ప్రమాదకరమని సిపిఐ జాతీయ నాయకులు చాడ వెంకట్ రెడ్డి అన్నారు. సిపిఐ శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని జోడేఘాట్ నుంచి ప్రారంభమైన బస్సు యాత్ర మంచిర్యాలకు చేరుకున్న సందర్భంగా చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ... ప్రజా సమస్యల పరిష్కారం కోసం సిపిఐ నిరంతరం ఉద్యమాలతో ముందుకు సాగుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను రద్దుచేసిందనీ, నాలుగు కొత్త చట్టాలను కార్మికుల పైన రుద్దే ప్రయత్నం చేస్తుందని విమర్శించారు.

- పీటీసీ, మంచిర్యాల

**మెగా జాబ్ మేళా:**

సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో ఈ రోజు కొత్తగూడెం క్లబ్ లో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నారు. కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు, సింగరేణి సిఎండి బలరాం నాయక్ మేళాను ప్రారంభించారు.

-పీటీసీ, భద్రాద్రి

**సమ్మక్క సారలమ్మ :**

మేడారం సమ్మక్క సారలమ్మ జాతర అభివృద్ధి పనులను మంత్రి ధనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ తో కలిసి ఈరోజు పరిశీలించారు. ములుగు జిల్లా పర్యటనలో భాగంగా ములుగు గట్టమ్మ దగ్గర 45 లక్షల రూపాయల నిధులతో చేపడుతున్న బ్రిడ్జి నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం మేడారంలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించి, జాతర పనులు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.

---సౌండ్ బైట్: మంత్రి సీతక్క------------

శబరిమల:

కేరళ శబరిమల అయ్యప్ప స్వామి ఆలయాన్ని తలుపులు ఈ సాయంత్రం తెరుస్తారు. భక్తులను రేపటి నుండి స్వామి వారి దర్శనానికి అనుమతిస్తారు. తెల్లవారుజామున అధికారిక ఆచారాలు, కొత్త పూజారులు తలుపులు తెరవడంతో మండల మకరవిళక్కు తీర్థయాత్ర సీజన్ ప్రారంభమవుతుంది. ప్రతిరోజు 70 వేల మందిని దర్శనానికి అనుమతిస్తారు. కాగా, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు ట్రావెన్ కోర్ దేవస్థానం బోర్డు ఓ ప్రకటనలో వెల్లడించింది. -డెస్క్

**వాతావరణం:**

రాష్ట్రంలో చలి తీవ్రత పెరుగుతోంది. రాత్రిపూట ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయిలో పడిపోతున్నాయి. మరి కొన్ని రోజుల పాలు ఇదే పరిస్థితి కొనసాగుతూ... రాబోయే రోజుల్లో రాత్రిపూట ష్ణోగ్రతలు మరింత తగ్గే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఆసిఫాబాద్ జిల్లాలో నిన్న అత్యల్పంగా సిర్పూర్(యు) లో 7.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా జిల్లావ్యాప్తంగా పలు చోట్ల 10 డిగ్రీల కంటే తక్కువగా ఉష్ణోగ్రత నమోదయింది. ఏజెన్సీ ప్రాంతాల్లో చలి తీవ్రతకు ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తల పట్ల జిల్లా అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో సగటున కనిష్ఠ ఉష్ణోగ్రత 9డిగ్రీలు ఉండగా గరిష్ట ఉష్ణోగ్రత 32డిగ్రీలుగా నమోదయింది. రుద్రంగిలో అత్యల్ప ఉష్ణోగ్రత

9.0డిగ్రీలుగా నమోదయింది. చలి తీవ్రతకు సాయంత్రం 6 గంటల లోపు  ప్రజలు ఇళ్లలోకి చేరుకుంటున్నారు.

-డెస్క్/పీటీసీ ఆసిఫాబాద్/పీటీసీ సిరిసిల్ల